# పొద్దుగాళ్ల వచ్చినా విత్తనాలు దొరకలే..




విత్తనాల కోసం పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు వద్ద బారులు తీరిన రైతులు

రామారెడ్డి, మే 29: ప్రభుత్వం జీలుగ, పెద్ద జనుము విత్తనాల బస్తాలను తక్కువ సంఖ్యలో సరఫరా చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సదాశివనగర్ మండలంలో మొత్తం 7వేల మంది రైతులు వరి సాగు చేస్తున్నారు. వీరందరికీ జీలుగ, పెద్ద జనుము విత్తనాలు అవసరముండగా బుధవారం పంపిణీ కేంద్రాలకు చేరుకున్నారు. తీరా చూస్తే జీలుగ 987, జనుము 300 బస్తాలు మాత్రమే రావడంతో కొందరికే లభించాయి. ఉదయం 6గంటలకు వచ్చినా విత్తనాలు దొరకలేదని పలువురు రైతులు నిరాశగా వెనుదిరిగారు. మండల వ్యవసాయాధికారి ప్రజాప్రతిని వివరణ కోరగా రైతులకు ఆన్‌లైన్ పద్ధతిలో విత్తనాలు అందజేస్తున్నామని, మరిన్ని బస్తాల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ పంపించామని, మలివిడుతలో వస్తే రైతులకు అందజేస్తామని తెలిపారు.


సదాశివనగర్‌లో జనుము, జీలుగ విత్తనాల కోసం పట్టా పాసుబుక్కులను క్యూలో పెట్టిన రైతులు

'చిహ్న'భిన్నంపై

# ప్రజాగ్రహం




తెలంగాణ రాష్ట్ర అధికారిక ముద్రలోని చిహ్నాలను తొలగించాలని కాంగ్రెస్ సర్కారు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన కొనసాగించిన కాకతీయులు అనగానే కళాతోరణం గుర్తుకు వస్తుందని, రాజధాని హైదరాబాద్ అనగానే గుర్తుకు వచ్చే చార్మినార్ చిహ్నం తెలంగాణ చారిత్రక గుర్తులని.. అలాంటి వాటిని తొలగిస్తే చూస్తూ ఊరుకోమని ప్రజలు మండిపడుతున్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలోని గుర్తులను చెరిపేస్తే.. మరోసారి ఉద్యమం మొదలవుతుందని ఉద్యమకారులు, కవులు, రచయితలు పేర్కొంటున్నారు. రాచరికపు గుర్తులు కావు.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన చిహ్నాలని అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

## మారిస్తే మళ్లీ ఉద్యమమే..



ఖలీల్‌వాడి, మే 29 : తెలంగాణ ఉద్యమంలో ఎన్నో అడ్డంకులు ఎదుర్కొన్నాం. అలనాటి సంస్కృతులు గుర్తు చేసుకునేలా చేశాం. తెలంగాణ చిహ్నంలో ఉన్న కాకతీయుల కళాతోరణం, చార్మినార్ గుర్తులు ప్రపంచానికి తెలుసు. మన సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకు తెలియడం లేదు. తెలంగాణ అంటేనే కాకతీయులు, చార్మినార్ గుర్తుకు వస్తుంది. అలాంటిది మార్చుతామంటే ఊరుకుంటామా? మళ్లీ ఉద్యమిస్తాం.

**- తెలంగాణ శంకర్, ఉద్యమకారుడు**

## చిహ్నాలు తొలగించేందుకే సీఎం అయ్యావా?



ఖలీల్‌వాడి, మే 29 : రాష్ట్ర అధికారిక చిహ్నాలను తొలగించడానికే ముఖ్యమంత్రి అయ్యావా.. అయ్యా రేవంత్ రెడ్డి. తెలంగాణ మీద మీకు ఎంత ప్రేమ ఉన్నదో ఇప్పుడు తెలుస్తున్నది. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పాలన మీద దృష్టి పెట్టడం నేర్చుకొండి. తెలంగాణ ప్రజలు నీకు అధికారం ఇచ్చింది. ఆంధ్రోళ్లకు అప్పగించడానికి కాదు. చిహ్నాల జోలికి వస్తే మళ్లీ ఉద్యమం మొదలవుతుంది. తెలంగాణ గుర్తులు మార్చడమేంటి. మీకు తెలంగాణ చరిత్ర తెలుసా?

**- సుజీత్‌సింగ్ ఠాకూర్, ఉద్యమకారుడు**

## తెలంగాణ ఆనవాళ్లు కనుమరుగు చేసే కుట్ర



ఖలీల్‌వాడి, మే 29: తెలంగాణ ఉద్యమంలో ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడ ఉన్నాడు. తెలంగాణ గురించి ఎప్పుడైనా మాట్లాడారా? ప్రజలు నువ్వు ఇచ్చిన హామీలను నమ్మి అధికారంలోకి తీసుకువస్తే రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేస్తున్నావ్. రాష్ట్రంలో రైతులు ఎలా ఉన్నారు. వారి సరిస్థితి ఏంటి అనే ఆలోచన చేయకుండా తెలంగాణ ఆనవాళ్లు కనుమరుగు చేయాలని చూస్తున్నావ్. తెలంగాణ ప్రజలు సహించరు. తరిమితరిమి కొడతారు. అధికారం ఇచ్చిన ప్రజలే బుద్ధి చెబుతారు. తెలంగాణ కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు చోద్యం చూస్తున్నారు. తెలంగాణ చిహ్నాలు తీసివేస్తే ఎందుకు మౌనం వహిస్తున్నారు.

**- రాజారాంయాదవ్, ఉద్యమకారుడు**

## రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని మార్చొద్దు



గాంధారి, మే 29: వందల ఏండ్ల నాటి తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువైన చార్మినార్, కాకతీయ కళా తోరణాన్ని రాష్ట్ర అధికారిక చిహ్నం నుంచి తొలగించొద్దు. చార్మినార్, కాకతీయ కళాతోరణంతో తెలంగాణ చారిత్రక వైభవం, సంప్రదాయాలు, సంస్కృతులు కనిపిస్తాయి. చార్మినార్, కాకతీయ తోరణాలను రాష్ట్ర చిహ్నం నుంచి తొలగిస్తే భావితరాలకు మన తెలంగాణ చరిత్ర, సంప్రదాయాల గురించి తెలియకుండా పోతుంది. రాష్ట్ర చిహ్నాన్ని మారుస్తామనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి.

**- పెద్దబూరీ సత్యం, (మాజీ సర్పంచ్), తెలంగాణ ఉద్యమకారుడు, గాంధారి**

## అవి చారిత్రక గుర్తులు



రాష్ట్ర అధికారిక చిహ్నంపై ఉన్న చార్మినార్, కాకతీయ కళాతోరణం మన తెలంగాణ, సంప్రదాయ, సంస్కృతితోపాటు గత చరిత్ర వైభవాలను గుర్తుచేస్తాయి. వాటిని తొలగిస్తే చరిత్ర వైభవాన్ని మనమే నాశనం చేసుకున్న వాళ్లమవుతాం. చార్మినార్, కాకతీయ కళాతోరణం గుర్తులను రాష్ట్ర ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలి.


**– కేతావత్ బలరాం నాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, గాంధారి మండలం**

## మార్చడం సబబు కాదు



డిచ్‌పల్లి, మే 29: తెలంగాణ అధికారిక చిహ్నం మార్చడం సరైన నిర్ణయం కాదు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిహ్నాలు రాచరికపు గుర్తులు కావు. చార్మినార్ అంటే హైదరాబాద్‌కు ఐకాన్ లాంటిది. వెయ్యేండ్ల సాంస్కృతిక వైభవానికి చిహ్నాలు. వెలకట్టలేని తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలు. చిహ్నాలను తొలగించకుండా పాత వాటినే కొనసాగించాలి.

**- మద్దుకూరి సాయిబాబా, కవి**



## వరి నాట్లు షురూ

నిజామాబాద్ జిల్లాలో ముందస్తు వరినాట్లు మొదలయ్యాయి. ఏ సీజన్‌లో అయినా మొదటగా వరినాట్లు వేయడంలో రాష్ట్రంలోనే చందూర్, మోస్రా, బాన్సువాడ తదితర ప్రాంతాలు ప్రసిద్ధి. ఇక్కడి రైతులు అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడుకునేందుకు ముందుగానే నారు వేసుకొని త్వరగా నాట్లు వేస్తుంటారు. చందూర్ మండలంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో వానకాలం నాట్లు వేస్తున్న దృశ్యాలను నమస్తే తెలంగాణ క్లిక్‌మనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



# ఒక్కరు కాదు.. వందల్లో బాధితులు

- గర్భిణులను నగ్నంగా ఫొటోలు తీసిన కిరాతకుడు
- నిందితుడి ఫోన్‌లో వందలాది వీడియోలు, స్కాన్ చిత్రాలు
- పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి..




ఖలీల్‌వాడి, మే 29: తీగ లాగితే డొంక కదిలిన చందంగా అయ్యప్ప స్కానింగ్ సెంటర్ విషయంలో పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు బయటికి వస్తున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో సీపీ కల్మేశ్వర్, డీసీపీ శేషాద్రిరెడ్డి నేతృత్వంలో సీఐ శ్రీలత విచారణ చేపట్టారు. నిందితుడి మొబైల్ నుంచి సేకరించిన డాటాను హార్డ్ డిస్క్‌లో భద్రపరిచినట్లు సమాచారం. నిందితుడు ప్రశాంత్ మొబైల్‌ను పోలీసులు పరిశీలించగా అశ్లీల వీడియోలు, రాసలీలలు, స్కానింగ్ చిత్రాలు ఉన్నట్లు తెలుస్తున్నది. మొదట ఒక్కరే బాధితురాలు అనుకున్న పోలీసులు.. మొబైల్‌ను పరిశీలించిన తర్వాత ఖంగుతిన్నారు. ఒక్కరు కాదు వందల సంఖ్యలో మహిళల వీడియోలు ఉన్నట్లు తెలిసింది. తన మొబైల్ నుంచి ఫొటోలు, వీడియోలను నిందితుడు ఇతరులకు ఏమైనా పంపించాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఎంతమంది మహిళలను బ్లాక్‌మెయిల్ చేశాడో తెలుసుకుంటున్నారు. సారంగాపూర్‌కు చెందిన ప్రశాంత్ కొన్నేండ్లుగా అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. స్కానింగ్ కోసం వచ్చే మహిళల్లో రోజుకు ఐదుగురి నుంచి 15 లేదా సగం మంది వీడియోలను చిత్రీకరించినట్లు తెలిసింది. స్కానింగ్ సెంటర్‌లో సీక్రెట్ కెమెరా పెట్టి దాని ద్వారా ఫొటోలు, వీడియోలు తీసేవాడని సమాచారం. ముందుగా స్కానింగ్ సెంటర్లకు వచ్చే యువతులను దుస్తులు మొత్తం విప్పితేనే పక్కాగా రిపోర్టు వస్తుందని నమ్మించి సీక్రెట్ కెమెరాతో బంధించేవాడని, వివరాల నమోదు సమయంలో మహిళలు ఇచ్చే మొబైల్ నంబర్లను తీసుకొని.. ప్రశాంత్ తీసిన అశ్లీల ఫొటోలు, వీడియోలను పంపించి బ్లాక్‌మెయిల్ చేసినట్లు తెలిసింది. శారీరకంగా వాడుకోవడంతో పాటు డబ్బులు తీసుకుంటూ వదిలేసేవాడని సమాచారం. కొంతమంది గర్భిణులకు లింగనిర్ధారణ చేస్తానని చెప్పి డబ్బులు డిమాండ్ చేసిన ఉదంతాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.ఈ నెల 5న ఓ మహిళ స్కానింగ్ కోసం సెంటర్‌కు వెళ్లింది. ఆ తర్వాత ప్రశాంత్ ఆమె ఫోన్‌కు అశ్లీల ఫొటోలు పంపించాడు. ఆ మహిళ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో ప్రశాంత్‌ను పట్టుకొని చితకబాదారు. ఈ విషయం స్కానింగ్ సెంటర్ యాజమాన్యానికి తెలియడంతో మహిళ కుటుంబసభ్యులను బుజ్జగించి పంపించినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్, సీపీకి ఫిర్యాదు చేయడంతో తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం పోలీసులు సేకరించిన డాటా విషయాలు కలెక్టర్‌కు తెలియడంతో అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌ను ఆదేశించారు. దీంతో స్కానింగ్ సెంటర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసి ప్రత్యేక కమిటీని వేశారు. ఈ కమిటీ వారంరోజుల్లో నివేదిక తయారుచేసి కలెక్టర్‌కు అందజేయనున్నది. ఇదిలా ఉండగా మొన్నటి వరకు స్కానింగ్ సెంటర్‌ను కాపాడేందుకు ప్రయత్నించిన సంబంధిత సంఘాల నేతలు.. అసలు విషయం బయటికి రావడంతో సైలెంట్ అయ్యారు.

### స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటాం



మహిళల వీడియోలు తీసిన నిందితుడిపై కేసు నమోదు చేశాం. మిగతా స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు చేస్తున్నాం. అందుకోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. స్కానింగ్ సెంటర్లకు వెళ్లే మహిళలు అనుమానం వస్తే వెంటనే డాక్టర్లకు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. స్కానింగ్ సెంటర్లలో మెడికల్ సిబ్బందిని మాత్రమే ఉంచాలి. నాన్ మెడికల్ సిబ్బందిని అనుమతించకూడదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డాక్టర్లు తగిన జాగ్రత్తలు పాటించాలి.

**- కల్మేశ్వర్ సింగేనవార్, సీపీ**

# ప్రాణాలు తీసిన సెల్ఫీ

మంజీరాలో స్నానానికి వెళ్లి ఇద్దరి మృతి


పండరి, టిల్లు (ఫైల్ ఫొటోలు)

నస్రుల్లాబాద్, మే 29: స్నానం కోసం వెళ్లిన ఇద్దరు మంజీరా నదిలో నీటమునిగి మృతిచెందిన ఘటన బీర్కూర్‌లో బుధవారం చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన న్యాంతాబాద్ పండరి(32), టిల్లు(14)తోపాటు మరో ముగ్గురు స్నానం చేసేందుకు సమీపంలోని మంజీరా నదికి వెళ్లారు. స్నానం చేసిన అనంతరం టిల్లు నది వద్ద సెల్ఫీ(ఫొటో) తీసుకుంటుండగా కాలుజారి పడ్డాడు. దీంతో టిల్లును కాపాడేందుకు పండరి సైతం నదిలో దూకడంతో ఇద్దరూ మృతి చెందారు. మరో ముగ్గురు స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు పండరికి భార్య విజయ, ఒక కూతురు ఉన్నారు. మండల కేంద్రంలో చికెన్‌షాపు నడిపించుకునేవాడని తెలిపారు. టిల్లు బీర్కూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుకుంటూ చికెన్ షాపులో పనిచేసేవాడని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాలను బాన్సువాడ దవాఖానకు తరలించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

